


సంపుటి : 10

సంచిక : 2

త్రైమాసిక పత్రిక

ఏప్రిల్ 2007



నిర్వహణ

గురూజీ ఆశీస్సులతో గురుబంధువులు

చిరునామా

గురుకృప

2-1-6,

గాంధీచౌక్

తెనాలి-01

✈

08644

227194 (O)



ముద్రణ

రామకృష్ణ ప్రింటర్స్

విశాఖపట్నం

ఫోన్స్ :

2798072

2740222


**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై!**

**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

## ఉన్నమాట- అనుకున్నమాట

సద్గురుదేవా! మీ అనుగ్రహాశీస్సులతో నూత్నవత్సరం మా జీవితాల్లో మరింత నూతనంగా ప్రారంభమయింది. మీ దర్శన భాగ్యంతో తనువంతా పులకరించింది. మీ అడుగుల గురుతులను తలచుకుంటూ, మా తప్పటడుగులు గమనించే ప్రయత్నం మొదలుపెట్టాము. ప్రజలందరి నోటా సాయినామం పలకాలన్న మీ ఆకాంక్ష యావత్ జగత్తును ఉత్తేజపరిచి, ఉత్సవంలా మారి సాయినామ సాగరమే ఏర్పడిందా! అన్నట్లు బొడ్డపాడులో సప్తాహం సాగింది. ఇక చెన్నైలో జరిగిన సాయి సంరంభంతో ఒక నూత్న ఒరవడి ప్రారంభమయింది. మీ మాట వినాలని, మీ రూపు గాంచాలని, తపించే వారికి ఒక చిరు అవకాశమయ్యింది చెన్నై వేదిక. సద్గురు దేవులు శ్రీ బాబూజీ సత్సంగ భాషణాన్ని అవధరించే అవకాశం లభించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు గురుబంధువులు.

గురుదేవుల సత్సంగ భాషణాన్ని అక్షరమక్షరం అందించలేకపోయినా, వారి సందేశాన్ని అందించే ప్రయత్నం చేస్తోంది గురుకృప. “మనం ఒక మూడు పాయింట్ల ఫార్ములాను మన జీవితాల్లో పాటించే ప్రయత్నం చేయడం ఎంతైనా అవశ్యకం. మొట్టమొదటగా మన లక్ష్యం ఏమిటి? మన లక్ష్యం నుంచి మనలను ప్రక్కదోవ పట్టిస్తున్న అంశాలేమిటి? మరియు కేవలం మన లక్ష్యం పైనే మనం శ్రద్ధ వహిస్తున్నామా? ఈ విషయాలను మనం తప్పక గమనించుకోవాలి” అంటారు పూజ్య గురుదేవులు శ్రీ బాబూజీ. ఇహపర శ్రేయోదాయకమైన సద్గురు పథంలో మనం లక్ష్యం లేకుండా సాగిపోతున్నామా? అవగతం కాలేదు. ఆగిపోయేందుకు చోటు







లేనిదీ పథం, ఆనందంగా సాగిపోయే జీవన తరంగం ఈ పథం. మరి ప్రతి వారికి ఒక లక్ష్యం ఉందా? ఉంది. తప్పక ఉంది. " సద్గురు దేవుని అనుగ్రహంతో మన జీవితాల్లో వారందించిన అనుభూతులను అనుభవంలోనికి తెచ్చుకుని సర్వజీవ స్వరూపమైన సద్గురు తత్వాన్ని ఈ జగత్తంతా దర్శించడమే సందర్శనం – అదే మనందరి లక్ష్యం. అలా సద్గురు చరణాలను చేరడమే మన గమ్యం". చరిత్రలో అయితే కొందరు సాయిభక్తులు గురుదేవులు చూపిన, తెలిపిన భిన్నమైన ఈ సాయి సంప్రదాయాన్ని అనుసరించారు. అన్ని జీవులకు సద్గురువే మార్గదర్శి కూడా! ఈ విషయాన్ని 'మిష'లైన భక్తుల ద్వారా తేటతెల్లం చేశారు కూడా! చరిత్ర చెప్పే ఈ సత్యాలను కూడా అవలోకించుకుందాం. ఇదంతా సద్గురుదేవుల ఏర్పాటే! వారిచ్చిన అనుభూతులను ఒక పూలమాలగా గుచ్చుకుని అనుభవంలా ఆనందంగా అలంకరించుకున్న సద్గురుభక్తుల చరితలను దర్శిద్దాం.

రఘువీర పురందరే 1913లో తన తల్లితో కలిసి సాయిని దర్శించాడు. కానీ ఆమె పండరి వెళ్లాలని తరచూ అతనిని ఒత్తిడి చేసేది. ఆమెను సాయి, "పండరి ఎప్పుడు వెళ్తావ్" అని పదే పదే హెచ్చరించసాగారు. ఒక రోజు మధ్యాహ్నం తల్లీ కొడుకులిద్దరూ పండరి వెళ్లడానికి అనుమతి కోరాలని మశీదు చేరారు. వారిద్దరికి సాయి రుక్మా సమేతుడైన విఠలుడుగా దర్శనమిచ్చారు. ఆ తల్లి ఆనందానికి మేరలేదు. నాటినుంచి, "పండరి ఎప్పుడు వెళ్తావ్" అని సాయి హెచ్చరించినపుడల్లా ఆమె శిరిడీయే తనకు పండరి అనేది. విఠలునిగా అనుభూతమయిన సాయినే అనన్యంగా మార్చుకుంది ఆ తల్లి. సాయి చరణాలే రక్షగా భావించింది. శిరిడీనే తన పండరిపురమని అవగతం చేసుకుంది. సాయి ఒసగిన ఆ అనుభూతిని అనుభవంలోకి తెచ్చుకుంది. సాక్షాత్తు బాబానే ఎప్పుడు పండరి వెళ్తావని అడిగితే శిరిడీనే తనకు పండరిపురమని తెలియచేసుకుంది. చరిత్రలో ఇలా ఎన్నో అనుభూతులు, అయితే అవి సాయి మార్గంలో మనకు ఎందుకు సత్యద్రష్టలు అయ్యాయంటే ఆ భక్తులు అనుభూతులను అనుభవంలోకి తెచ్చుకుని ఆచరణతో మనకందించారు గనుక.

భగవాన్ రమణుల సన్నిధానంలో కూడా ఇలాంటి సంఘటనలు జరగటం గమనించవచ్చు. దైవాన్నే ఎదురుగా ఉంచుకుని ఎందరో భక్తులు, కాశీ, ప్రయాగ,.... ఇత్యాదులంటూ క్షేత్రాటనం చేయాలని అనుకుంటుంటారు. అయితే భగవాన్ మాత్రం నిర్మొహమాటంగా ఆ క్షేత్రములకు పనిగట్టుకుని వెళ్లవలసిన అగత్యం లేదని, వాటితో సరిసమానమైన సన్నిధిలోనే ఆ భక్తులున్నారని తెలియచేప్పేవారు. భగవాన్ ఆ మాట చెప్పినా ఇంకా కొందరు భక్తులు ఆ పుణ్యక్షేత్రాలను ఆశ్రయించడం జరుగుతుండేది. అయితే పురందరే తల్లిలో ఆ వివేకాన్ని కలుగచేసిన సద్గురు సామ్రాట్టు సాయినాథుని చర్యలే మనకు ఉపదేశాలు.

1917లో జరిగిన ఈ అనుభవం కూడా మనకు మన లక్ష్యమేమిటో మనలను మన లక్ష్యం నుంచి దూరం చేసే అంశాలేమిటో, మనం లక్ష్యం పట్ల ఎంత శ్రద్ధ వహించాలో నన్న విషయాన్ని





తెలియచెపుతుంది. 1917లో శ్రీమతి తార్కాడ్, కుమారుడు ఇద్దరూ కలిసి సాయిని దర్శిస్తారు. బాబా చిన్నవాడైన తార్కాడ్‌ను రూ. 8ల దక్షిణ అడుగుతారు. తన దగ్గర ఆ పైకము లేదని సమాధానమివ్వడంతో ఆ దక్షిణను జోగ్ వద్ద నుంచి తీసుకురమ్మని సెలవిస్తారు సాయి. జోగ్ ఆ సమయంలో ధ్రువచరిత్రను చదువుచు తన తోటివారికి వ్యాఖ్యానము చెప్పుచుండెను. "సాధువులు దైవము కాకపోయినను ఆ దైవము వల్ల కొన్ని మహిమలు పొందిన వారని" చెప్పెను. వెంటనే అక్కడ నుండి వెనుతిరిగి సాయి వద్దకు చేరి, "బాబా! నన్ను అక్కడకు ఎందుకు పంపితివి – అక్కడ వారు నీవు మానవమాత్రుడవే కాని దైవము కాదని తెలుపుచుండిరి" అని పలికిరి.

అందుకు బాబా "అది నిజమే, నేనొక పేద ఫకీరును. నేను దైవమును కాదు. దైవము ఎంతో గొప్పవాడు. ఎవరును వారితో సరిపోల్చదగరని" పలికెను. "బాబా నీవు మమ్ము నీ మాటలతో మోసపుచ్చుచున్నారు. నీవే దైవమని మేము పూర్ణముగా విశ్వసించెదము. భగవంతుడు తనను నిందించిన కోపించడు కానీ, భాగవతులను నిందించిన సహింపడు కదా! సాధువులను గేలి చేయు చోట క్షణం కూడా నిలవరాదన్న మాట వాస్తవం కదా అంటాడు తార్కాడ్ కుమారుడు. ఆ మాటకు సాయి అవునని చెపుతూనే సద్గ్రంథ పారాయణను, నామజపమును చేయమంటారు. అయితే వీటికి మధ్యలో అవాంతరము ఏర్పడితే దోషము కలుగునని చేయుటకు తిరస్కరిస్తాడు తార్కాడ్ కుమారుడు. సాయి శ్రీమతి తార్కాడ్‌తో ఇలా అంటారు. "అమ్మా! నీ బిడ్డ యొక్క సంపూర్ణ బాధ్యతను నేను వహిస్తాను" అని సెలవిస్తారు. తల్లీ బిడ్డలు సాయి పాదాలకు ప్రణమిల్లుతారు. ఇంతలో అక్కడకు వచ్చిన కొందరు భక్తులతో సాయి అంటారు. " నా భక్తులను గూర్చి నేను జాగ్రత్త పడవలెను. నా భక్తుడెవడేని కూలుచున్న నా నాలుగు చేతులు చాపి వానిని ఆదుకొనవలెను". ఈ మాటలు విన్న తార్కాడ్ కుమారుడు "బాబా! ఇప్పుడే మీరు దైవము కాదని, పేద ఫకీరునని సెలవిచ్చారు. అయితే మీరెట్లు నాలుగు చేతులు కలిగియుందురని" ప్రశ్నించెను. బాబా సమాధానము చెప్పకనే చిరునవ్వు నవ్వి అంగీకార దృష్టితో మౌనము వహించెను. సాయియే దైవమని అనుభవంలోకి తెచ్చుకున్నాడు తార్కాడ్ కుమారుడు. సాయియే తన లక్ష్యమని అర్ధమయ్యింది. తన లక్ష్యాన్ని స్థిరం చేసుకోవడంలో అడ్డంకులైన మాటలను వర్జించారు. అక్కడి పరిస్థితులకు తలవంచక సాయినే దైవంగా, ధర్మంగా విశ్వసించాడు. సాక్షాత్తు సాయే ఆ బిడ్డను ఏమార్చప్రయత్నించినా తన లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. తన లక్ష్యం పట్ల శ్రద్ధ ఎంతగా ఉందంటే సాయి ఎవరితోనో చెప్పిన మాటల వెనుక ఆధ్యాత్మిక సత్యాలను కూడా జగత్తుకు ఎరుకపరచాడు తార్కాడ్ కుమారుడు. శ్రీ సాయి చెప్పిన బాటన నడవాలని ఆకాంక్షించే సద్గురు భక్తులకు మనవి. **" సకల ధర్మాత్ముడైన సద్గురువునే లక్ష్యంగా చేసుకుని, అందుకు దూరం చేసే ప్రతీ అంశాన్నీ విడిచిపెట్టి, గురువనే లక్ష్యాన్ని చేరడానికి రామబాణమైన శ్రద్ధను వహించే భక్తుల జీవితములు ధన్యము."**

**- గురుబంధువులు**







# మిషలు - ప్రగతి పథాలు

అవ్యాజమైన సద్గురు ప్రేమకు అక్షరరూపం 'గురుకృప'లోని భక్తుల అనుభవాలు. చరిత్రలో (చూడవచ్చునేమో కానీ) వెతికితే ఈ అనుభవరత్నాలు లభిస్తాయేమో కానీ ఊహకు మాత్రం అందవు సద్గురు చర్యలు – అందుకే అవి అగాధాలయ్యాయి – వాటి అంతరార్థాన్ని అవగతపరచమని వేడిన వారికి, వాటి అవసరమున్న బిడ్డలకు ఆ జ్ఞాన రత్నాలు వారి జీవన విధానంలో అనుభూతమయ్యి అనుభవంగా మారి చివరకు ఆచరణకు నోచుకున్నాయి. తన బిడ్డలను తనలా పరిపూర్ణం చేయ వేంచేసిన దివ్యత్వమే సద్గురు తత్త్వం. ఈ తత్త్వానిది భిన్నమైన మార్గం – గమ్యానికి సూటిగా చేరే లక్ష్యం. బిడ్డ ఏ మార్గంలో ప్రయాణిస్తుంటే – అదే మార్గంలో పయనింప చేస్తూనే తన చెంతకు చేర్చుకుంటారు సద్గురుమాయి. పూజ్య గురుదేవుల మాటల్లో 'ఋణానుబంధ రూపేణా' – చెంతకు చేరతాడు బిడ్డ. చేరేందుకు ఎన్నో 'మిషలు'. పంజాబీ రామ్‌లాల్ చేరటానికి స్వప్నంలో కన్పించి – చిత్రపటంగా దర్శన మిచ్చిన సాయి అద్భుత లీలా వినోదం కావచ్చు – సురేష్ విషయంలో 'బ్యాడ్జీ' మిషగా ఉత్సుకత రేపి జీవితాన్ని ఉత్సవంగా మార్చిన తీరుకావచ్చు. మిషలు ఏవైనా సద్గురు పదాలే, ప్రగతి పథాలే!

గురుబంధువులకు నమస్కారములు. నాపేరు వి.వి. సురేష్ కుమార్. మాది కందుకూరు (ప్రకాశం జిల్లా). నేను మొదటగా సాయిపథంలో అడుగిడిన సందర్భమును వివరించెదను. ఈ లీల కొంచెం గమ్మత్తుగా ఉంటుంది. నేను అసలు సత్సంగమునకు వచ్చిన కారణమేమంటే "జేబుకు పెట్టుకొనే బ్యాడ్జి కోసం". బాబా తన భక్తులను ఎక్కడ ఉన్నా పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు తన వద్దకు రప్పించుకుంటానని చెప్పారు. అదే విధంగా ఈ పిచ్చుకను బ్యాడ్జి అనే మిషచేత తన దగ్గరకు చేర్చుకొన్నారు. నేను 1998లో ఏప్రియల్ నెలలో సత్సంగమునకు వచ్చాను. అప్పుడు 10వ తరగతి అయిపోయింది. పదవ తరగతి పరీక్షలకు ముందు మాకు ఇంగ్లీష్ గ్రామర్ చెప్పడానికి శ్రీ మణిపాల్ రెడ్డిసార్ వచ్చేవారు. అప్పుడు నేను రోజూ ఆయన జేబుకి ఉండే బ్యాడ్జిని చూసేవాడిని. పరీక్షల తరువాత నేను ఆయన దగ్గర ఇంగ్లీష్ స్పెషల్ గ్రామర్ కోర్స్ చేరాను. అప్పుడు ఆ గది నిండా బాబా, గురువుగారి ఫోటోలు ఉండేవి. అప్పటికే అక్కడ సత్సంగం నిర్వహించబడుతున్నది. నేను ఒకసారి నా ప్రక్కన కూర్చొనే క్లాస్‌మేట్ శ్రీధర్, గురుబంధువుని అడిగాను. అందరికీ బ్యాడ్జిలు ఉన్నాయి, అసలు ఈ బ్యాడ్జీల విషయం చెప్పమన్నాను. అప్పుడు ఆ అన్నయ్య అక్కడ ప్రతి గురువారం రాత్రి గం.7–00ల నుండి గం.8–30ని.ల వరకు సాయిబాబా సత్సంగం జరుగుతుంది రమ్మని చెప్పాడు. సరే అని ఒక గురువారం నా కంప్యూటర్ క్లాసు నుండి నేరుగా సత్సంగానికి వెళ్ళాను. అప్పుడు సార్ నన్ను చూసి ఏంటి ఈ టైంలో వచ్చావు అని అడిగితే సాయిబాబా





భజన కోసం వచ్చానని బదులుచెప్పాను. సార్ నన్ను ఆనందంగా లోనికి స్వాగతించారు. ఈ విధంగా నా సాయిపథ ప్రవేశం జరిగింది. మొదట్లో మా యింట్లో వాళ్ళకు తెలియదు. కాని ఒక గురుబంధువు (జనార్ధన్) ద్వారా మా అమ్మకు తెలిసింది. సాయిపథప్రవేశం నా జీవితాన్నే మార్చేసింది. మా యింట్లోవాళ్ళు నన్ను బయట చదువుకోవటానికి పంపడానికి భయపడేవారు. కాని మా చిరంజీవి మాస్టారుగారి ప్రోత్సాహంతో నన్ను ఒంగోలు శ్రీ ప్రతిభ కాలేజిలో చేర్పించారు. నా మెరిట్ (10వ తరగతిలో 487/600) చూసి ఆ ప్రిన్సిపాల్ అందుకు అంగీకరించారు. నిజంగా ఇది మాయింట్లో వాళ్ళు ఎవరూ ఊహించలేదు, నేను ఒంగోలులో చదువుతానని. ఇంటర్ మొదటి సంవత్సరంలో సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చాను. ఒక గురుబంధువు రాజుగారి ప్రోత్సాహంతో గురువుగారికి మొదటిసారిగా లేఖ రాశాను. ఆ ఉత్తరంలో నాకు జీవితంలో ఒక్కసారైనా బాబా దర్శనం కల్పించమని అడిగాను. నేను రెండవ సంవత్సరం చదివేటప్పుడు మా యింట్లో వాళ్లు మనం షిరిడీ వెళ్తున్నామని చెప్పారు. నిజంగా ఆ సమయంలో నా ఆనందానికి అవధులు లేవు.

మేము 2000 సం. జూన్‌లో గురుపౌర్ణమి వారం రోజుల తరువాత షిరిడీకి బయలు దేరాము. అదిలాబాద్ జిల్లా మంచిర్యాలలో మా పిన్నివాళ్ళ ఇంటికి వెళ్ళాము. ఆ రోజు సోమవారం. మంగళవారం షిరిడీకి బయలు దేరాలి. రిజర్వేషన్ కూడా అయింది. ఆ రోజు మహారాష్ట్ర స్టేట్ బంద్ అని బస్సులు నడవవని చెప్పారు. రిజర్వేషన్ కూడా కాన్సిల్ అయింది. ఇక నా బాధ అంతా ఇంతా కాదు. ప్రక్కనే ఉన్న బాబా గుడికి వెళ్ళి మొరపెట్టుకున్నాను, ఆ రోజు రాత్రి నాకు షిరిడీ వెళ్ళినట్లు, అక్కడ తిరిగినట్లు స్వప్నదర్శనం జరిగింది. నేను నా స్వప్నాన్ని మా వాళ్ళకు చెప్పి ఖచ్చితంగా మనం షిరిడీకి వెళ్తామని చెబితే వాళ్ళు నమ్మలేదు. బంద్ ఆగదు అని చెప్పారు. మరుసటి దినం మళ్ళీ రిజర్వేషన్ కోసం మా వాళ్ళు ట్రై చేశారు. ఆశ్చర్యం! బంద్ ఆగిపోయింది. షిరిడీ వెళ్ళడం కన్‌ఫర్మ్ అయింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నేను షిరిడీ సమాధిమందిరంలో బాబా దర్శనం చేసుకొన్నాను. ఆ మధురానుభూతిని ఇప్పటికీ మరువలేను. ఆ రోజు రాత్రి 8 గంటలకు సాయియానాలో గురువుగారి దర్శన భాగ్యం కలిగింది. మరుసటి రోజు గురువుగారి పాదదర్శనం జరిగింది. అప్పుడు నేను గురువుగారిని నాకు ఇంజనీరింగ్ సీట్ వస్తుందా అని అడిగాను. గురువుగారు చేయి ఊపి వస్తుందని అభయం ఇచ్చారు.

నా ర్యాంకు 20,000. ఆగస్టులో కౌన్సిలింగ్‌కి వెళ్ళాము. సద్గురు అనుగ్రహంతో ఏదైనా జరుగుతుందన్నది సత్యం. నాకు కంప్యూటర్ సైన్స్‌లో సీట్ వచ్చింది. అసలు మా వాళ్ళందరూ నాకు ఎలక్ట్రానిక్స్‌లో కూడా సీటురాదని చెప్పారు. మా అన్నయ్య అయితే సి.ఎస్.ఇ.లో గాని,







ఐ.టి.లోగాని అసలు రాదని ఖచ్చితంగా తేల్చిచెప్పాడు. కాని సింగరాయకొండలో ఒక సి.ఎస్.ఇ., నరసరావుపేటలో ఒక ఐ.టి. సీట్ ఉన్నాయి. గురువుగారి అనుగ్రహంతో. సి.ఎస్.ఇ.లో సీట్ తీసుకొన్నాను. అప్పట్లో నాకు అర్థం కాలేదు. కాని కాలక్రమేణా తెలిసిందేమిటంటే మా ఆర్థిక స్థితికి అదే కరెక్ట్ అని. రోజూ ఇంటి దగ్గర నుండే కాలేజికి వెళ్ళేవాణ్ణి. చూడండి, ఎంత ప్రణాళికాబద్ధమైన అనుగ్రహమో గురువుగారిది. ఇంటి దగ్గరే ఉండి బి.టెక్, సి.ఎస్.ఇ.లో డిస్టింక్షన్‌లో పాస్ అయ్యాను. అసలు నాకు డిస్టింక్షన్ కూడా బాబా, గురువుగారి గ్రేస్ వల్లే వచ్చింది. 4-1 సెమిస్టర్ వరకు మార్కులు నాకు బార్డర్‌లో ఉన్నాయి. కాని బాబా, గురుదేవుల గ్రేస్ వల్ల నేను డిస్టింక్షన్‌లో 70.23%తో పాసయ్యాను. బాబా "నా ఆజ్ఞ లేకుండా ఆకైనా కదలదు" అంటే ఇదేనేమో (2000). ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాను. సద్గురు అందించే ప్రసాదం కోసం ఎదురుచూస్తూ ... మళ్ళీ మరోసారి ఆ వరప్రసాదాన్ని అందరితో పంచుకొంటాను. **– సురేష్, కందుకూరు**

## స్వప్నమా - కాదు సత్యమే!

"ఊరడిల్లుము! నీయాతురతను పారద్రోలుము; నీ కష్టములు గట్టెక్కినవి. ఎంతటి బాధలున్నవారైనను ఎప్పుడైతే ఈ మసీదు మెట్లు ఎక్కుదురో వారి కష్టములన్నియు నిష్క్రమించి సంతోషమునకు దారితీయును. ఇచ్చట ఫకీరు మిక్కిలి దయార్ద్ర హృదయుడు. వారి వ్యాధిని తప్పక బాగుచేయును. ఆ ఫకీరు అందరిని ప్రేమతోను దయతోను కాపాడును" – చరిత్ర చెప్పే అనుభవం. భీమాజీ పాటీలు కున్న రుగ్మతను నివారించ సాయి చేసిన స్వప్న లీలా వినోదం మననం చేసుకుంటూ వర్తమానంలో ఆనంద తీరాలు చేరేందుకు స(మ)ద్గురు దేవులు శ్రీ బాబూజీ చేసిన ఈ స్వప్న లీలా వినోదాన్ని ఆస్వాదిద్దాం. ఈ స్వప్నం రుగ్మతలకు సమాధానమే కాదు – వారి బిడ్డలకు అభయ ప్రదానాన్ని కూడా చేయడం – చల్లని తెమ్మెరకు చక్కని పరిమళం కలిస్తే ఎలా ఉంటుందో ... అలా...

నాకు ఈ మధ్య కలిగిన అనుభవం ఒకటి మీతో పంచుకోవాలనుకుంటున్నాను. మేము ఇల్లు మారి కొత్తగా కూకట్‌పల్లి వచ్చాము. వచ్చిన కొద్ది రోజులకు మా పక్క ఇంటిలో (అరుణగారు) సత్సంగం ప్రతివారం జరుగుతుందని వచ్చి పిలిచారు. నాకు బాబా అంటే చాలా ఇష్టం. నేను సత్సంగానికి వెళ్ళినపుడు చాలా బావుంది అనిపించింది. ఎంతో ప్రశాంతంగా ఉంది. అప్పుడు రెగ్యులర్‌గా వెళ్ళే అదృష్టాన్ని ఇమ్మని కోరుకున్నాను. నాకు కొద్దిరోజులకు ఒక కల వచ్చింది. కలలో ఒకాయన కనిపించి బాబా పాలరాతి విగ్రహాన్ని ఇచ్చి కోపాన్ని తగ్గించుకోమని చెప్పారు. నాకు ఆయన ఎవరో తెలీదు. రూపుకూడా స్పష్టంగా లేదు. నేను సత్సంగాలకు వెళుతూ వున్నాను. ఆధ్యాత్మిక జీవితానికి గురువు ఎంత అవసరమో,







సద్గురువు విశిష్టత ఏమిటో తెలుసుకున్నాను. జరిగిన సంఘటనలన్నీ చూసుకుంటే నాకు బాబా ప్రసాదించిన సద్గురువు బాబూజీ అని, నా కలలో కనిపించింది గురువుగారే అని గ్రహించాను. కానీ ఏదో మూల చిన్న అనుమానం నా గురుదేవులు వీరేనా అని. సత్సంగంలో అప్పుడప్పుడు అనుభవాలు చెప్తుంటారు. నాకంటూ చెప్పుకునే అనుభవాన్ని ఎప్పుడు ఇస్తారా అని ఫీల్ అయ్యేదాన్ని. నేను ఎప్పుడూ బాబాని మనస్ఫూర్తిగా వేడుకునే దాన్ని, బాబా నా తృప్తికోసమన్నా నా గురుదేవులు వీరే అని తెలియచేయండి.నాకు స్వప్నదర్శనం అయినా ఇప్పించి ఒక్కమాట అయినా మాట్లాడమనండి. మీరే గురుదేవులకు చెప్పాలి అని ఎంతో వేడుకున్నాను. నా చెడ్డ సంస్కారాలు అడ్డుపడుతున్నాయేమో, నాకా అర్హత లేదేమో. బాబా మీరే నాకా అర్హతను కలిగించాలి అని నేను గురువుగార్కి ఎన్నో సార్లు చెప్పుకునేదాన్ని. గురువుగారూ, మీతో మాట్లాడే అదృష్టం, అర్హత, యోగ్యత, అవకాశం నాకు లేవేమో. మీరు నాకు స్వప్న దర్శనం అయినా ఇప్పించి, ఒక్కమాట (నీకు కలలో కనిపించింది నేనేనమ్మా అని) మాట్లాడాలని, నేను అప్పుడే నిజమైన గురుబంధువునని, ఆరోజే నాకు అసలైన గురుపూజోత్సవం అని, ఆర్తిగా తపనతో వేడుకునేదాన్ని. ఈ మధ్య మా చిన్నబాబు తేజకు 20 రోజులుగా ఆరోగ్యం బావుండటం లేదు. ఏది తీసుకుంటే అది వాంతులు అయిపోతున్నాయి. చెప్పాలంటే హాస్పిటల్‌లో చేర్పించాల్సిన పరిస్థితి. కాని ఇంటి దగ్గరే మందులు వాడుతున్నాము. నేను బాబానే నమ్ముకున్నాను. ఏది చేసినా బాబా ఇష్టం. మొన్న అంటే 27-11-06 రాత్రి మా బాబుతో నీకు నువ్వే వేడుకోమ్మా బాబా, గురువుగార్ని నీకు తగ్గిపోవాలని అని చెప్పి పడుకున్నాము. నాకు తెల్లవారుఝామున కలవచ్చింది. కలలో గురువుగారు వచ్చారు. నేను సాష్టాంగ నమస్కారం చేసుకున్నాను. మా బాబు కూడా చేసుకుంటున్నాడు. అప్పుడు గురువుగారు మా బాబుని లేవదీసి తన ఒళ్ళో కూర్చోబెట్టుకుని చేతితో ఆశీర్వదించి ఫరవాలేదమ్మా, నేను చూసుకుంటాను, ఏమీ కాదు అని చెప్పారు. కల అయిపోయింది. నేను ఎంత అదృష్టవంతురాలిని, ఈ జన్మకు ఇది చాలు అనిపించింది. గురువుగారు మాట్లాడటమే కాకుండా అభయం కూడా ఇచ్చారు. నా ఆనందానికి అవధులు లేవు. చెప్పడానికి మాటలు చాలవు. నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. ఈ జన్మకే కాదు, జన్మ జన్మలకి బాబా, గురువుగారు నాకు తోడుండాలని కోరుకుంటూ... **కె. రమాదేవి**

గురుబంధువులు వారి అనుభవాలను, అనుభూతులను
gurukrupa@saimail.com కు పంపగలరు.

**ఇంటర్‌నెట్‌లో "గురుకృప" : www.guruji.org**





# ప్రణాళికా బద్ధం - అనుగ్రహంతో అన్నీ సిద్ధం.

సాయి అంకిత భక్తురాలు సావిత్రీబాయిటెండ్యూలర్ మనందరికీ సుపరిచితమే! శ్రీ రఘునాథరావు టెండూల్కర్ పదవీ విరమణ సందర్భంలో అతని పింఛను విషయమై ఆ కుటుంబంలోని వారందరు ఆతురతతో ఉండిరి. శ్రీ సాయి తన బిడ్డల కుటుంబ పోషణ బాధ్యతను స్వీకరించిన వారై రూ. 75ల పింఛను స్థానే రూ.110ల పింఛను ఇచ్చి ఆదుకుంటారు. వారి అవసరాలు తీర్చటానికై సద్గురు కృపకు కారణం మన అర్హత, ప్రయోజకత్వాలు ఏ మాత్రం కాదనటానికి తార్కాణం ఈ గురుబంధువు అనుభవం. మన అర్హతతో సంబంధంలేని వారి సర్వసమమూ, సహజమూ అయిన వారి ప్రేమ మనలను ఆదుకుంటుంది, అనుగ్రహిస్తుంది, ఆనంద పథంలో పయనింప చేస్తుంది.

పూజ్యగురుదేవుల పాదములకు నమస్కరిస్తూ, నా పేరు అమర్, నేను హైదరాబాద్‌లో ఉంటున్నాను. జీవితంలో ఎదురయ్యే ప్రతీ సంఘటన సద్గురులీలాప్రబోధమే అన్న సద్గురు వాక్యం నా జీవితంలో నిజమయ్యింది. నేను పుట్టక ముందునుంచి మా అమ్మా, నాన్న ఎన్నో కష్టాలు పడ్డారు. నేను మా అమ్మకడుపులో ఉన్నప్పుడు, మా పొలం గురించి చాలా ఇబ్బందులు పడి, గొడవలలో ఇతరుల సహాయం తీసుకుంటేనే మా పంట చేతికి వచ్చిందట. ఆ పొలం పట్టా సంపాదించే పనిలో నాన్న ఆరోగ్యం దెబ్బతిని కామెర్లు వచ్చాయి. చివరకు మా పొలం మాకందింది.

నా నాల్గవ తరగతిలో మా ఊరిలో సరైన స్కూల్ లేకపోవడం వల్ల నన్ను నెల్లూరులోని బంధువుల ఇంట్లో ఉంచారు. కానీ అక్కడ రోజుకు ఒక్క గంట కూడా చదివేందుకు వీలు కుదిరేది కాదు. ఆ ఇంట్లో వాళ్ళ పనితోనే నా టైమ్ అంతా సరిపోయేది. వేసవి సెలవులకు ఇంటికి వెళితేనే నాకు ఆనందం. ఇలా నా 8వ తరగతి వరకు గడిచింది. 9వ తరగతి చదివేటప్పుడు నెల్లూరులో ఒక ఇల్లు బాడుగకు తీసుకుని నా చదువుకోసమని మా పెద్దమ్మను ఉంచారు. ఇక ఆ రెండు సంవత్సరాలు స్కూల్‌కని ఇంట్లోంచి వెళ్ళడం – సినిమాలు, షికార్లకు కాలాన్ని వృథా చేయడం. ఇలా చేసి చివరకు 10వతరగతి ఫెయిల్ అయ్యాను. చేసిన తప్పుకు చచ్చిపోదామనిపించి రైల్వే ట్రాక్ దాకా వెళ్ళి అమ్మా, నాన్నలు గుర్తొచ్చి వెనక్కి వచ్చాను. తప్పుదిద్దుకుని 10వ తరగతి పాస్ అయ్యాను. ఇంటర్ మొదటి సంవత్సరానికి కొంచెం పట్టుదల వచ్చింది. అమ్మా వాళ్ళు వెంకయ్యస్వామి వద్దకు వెళ్ళి రమ్మంటే వెళ్ళి వచ్చాను. ఇంటర్‌లో కూడా 55% మార్కులు వచ్చాయి.







పూజ్య గురుదేవులు చదివిన, ఆచార్య భరద్వాజ గారు లెక్చరర్‌గా పనిచేసిన ఎన్.బి.కె.ఆర్. కాలేజీలో డిగ్రీ చదివి 59.5% మార్కులతో డిగ్రీ పాసయ్యాను. తిరుమలకు నడిచి వెళ్ళాను. ఆ సంవత్సరం పాసయిన 8% విద్యార్థులలో నేనూ ఒకణ్ని. ఉద్యోగం కోసం 1997 సంవత్సరం హైదరాబాద్ వచ్చి నెలకు రూ.1,500/–లకు ఉద్యోగంలో చేరాను. శనివారం వచ్చిందంటే, ఆదివారం ప్రోగ్రామ్ ప్లాన్ చేసుకోవడం సినిమాలు, వాళ్ళ వీళ్ళ ఇళ్ళు తిరగడం – తిట్టడం, తిట్టించుకోవడం – మరల రొటీన్ లైఫ్ – ఎప్పుడూ చికాకు, మనసంతా కలత. ప్రశాంతతకు చోటు లేకుండా పోయింది.

అలా 2003వ సంవత్సరం వరకు గడిచింది. సంవత్సరాలతో పాటు నా జీతం రూ.1,500/–ల నుంచి రూ.3,000/–కు పెరిగినా, నేను దూరవిద్యా విధానంలో ఎమ్.కామ్ చేద్దామనుకుంటే అది సాధ్యం కాలేదు. 2001వ సంవత్సరంలో ఒక స్నేహితుడి రూమ్‌కు వెళ్ళినపుడు గురుదేవుల చిత్రపటాన్ని చూసాను. కానీ, “ఎవరు ఆయన, అలా కూర్చొన్నారు” అంటూ మాట్లాడి తప్పు చేసాను. 2002వ సంవత్సరంలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు శిరిడీ వెళ్ళాను. బాబా దర్శనం – బాబా ఊదీ తెచ్చుకున్నాను. ఆ ఊదీనే నాకు కామెర్లు వచ్చినపుడు దివ్య ఔషధమై వారం రోజుల్లో ఉపశమనాన్నిచ్చింది.

ఇక శ్రీ బాబూజీ అనే సద్గురు మాయి తన చెంతకు ఈ పిచ్చుకను ఎలా లాక్కొన్నారంటే – మా అక్క ప్రవీణకు – గురుబంధువు శ్రీ చంద్రశేఖర్‌తో వివాహమయ్యింది. కామెర్లు వచ్చి రెండు నెలలు, అంతకు ముందు సెలవులు, వాడుకున్నా ఆశ్చర్యంగా నాకు సెలవిప్పించారు శ్రీ బాబూజీ. వివాహమయిన నెలకు బావ హైదరాబాద్ రావడం జరిగింది. ఆడిట్ పనులలో బిజీగా ఉన్నా నాకు ఫోన్‌చేసి సాయంత్రం 6 గంటలకు సత్సంగానికి వెళ్దామని చెప్పారు. ఆ రోజే అమ్మ, నాన్న హైదరాబాద్ వస్తున్నారు – వాళ్ళ దగ్గరకు వెళ్ళాలి. కానీ నేను బయల్దేరబోయే ముందు బావ ఫోన్‌చేసి నేను వస్తున్నానన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సత్సంగానికి వెళ్ళాను. అక్కడ గురుదేవులను నాకు ‘సంతోషం’ కావాలని అడిగాను. ఎంతో తక్కువ కాలంలో అందజేశారు, ఆ సంతోషమే నన్ను ఈ రోజుకూ సత్సంగాలకు రప్పిస్తోంది. గురుబంధువులు పరిచయమయ్యారు. బావ నన్ను ఇక్కడకు రెగ్యులర్‌గా వస్తూ ఉండు’ అని చెప్పారు. నేను సత్సంగాలకు రెగ్యులర్‌గా వెళ్ళడంతో నా మనస్సుకు ఇంతకు మునుపులేని ప్రశాంతత లభించింది. ఇదే గురుస్థానమని అర్థమయ్యింది.

2005వ సంవత్సరంలో నా వివాహం చేద్దామని అనుకున్నారు. నేను పూజ్య గురుదేవులను వేడుకున్నాను – నా వివాహం శిరిడీలో వారి చెంతన జరిపించమని! నాకు ఒక మంచి లైఫ్





పార్టనర్ రావాలని, నేను చూసే మొదటి అమ్మాయినే నేను వివాహం చేసుకోవాలని వేడుకున్నాను. రెండు సంబంధాలు వచ్చినా నేను వారిని చూడకముందే అవి కాన్సిల్ అయ్యాయి. మూడవది, నేను చూసిన మొదటి సంబంధం 'షీలా'తో నా వివాహం నిశ్చయమైంది. శిరిడీలో వివాహం అంటే ఒప్పుకోరేమోనన్న మా పేరెంట్స్‌తో మా మామయ్య ఇప్పుడు వాడి ఇష్టప్రకారం చేయకపోతే రేపు ఏమైనా ఇబ్బంది వస్తే ఎలా అనడంతో 2005వ సంవత్సరం విజయదశమికి నా వివాహం గురుదేవుల చెంతన, సాయినామ సంకీర్తనల ఆశీస్సుల మధ్య జరిగింది. నాకు ఒక మంచి జీవితభాగస్వామినిచ్చారు గురుదేవులు. 1997వ సంవత్సరం నుంచి 2003 సంవత్సరానికి నా జీతం రూ,1,500/–ల నుంచి రూ.3,000/–లకు పెరిగింది. 2004లో ఒక రోజున బాబా నామ సంకీర్తనలో పాల్గొని ఆఫీసుకు వెళ్ళేసరికి, ఇంక్రిమెంట్స్ ఇవ్వని సమయంలో రూ.750/–లు ఇంక్రిమెంట్ ఇప్పించారు. 2004 నుంచి 2006వ సంవత్సరానికి నా జీతం రూ.7,500/–లు అయింది. నా వివాహమయిన కొన్ని రోజులకి గురుదేవులు నాకు ఇంట్లో కావాల్సినవన్నీ ఏర్పాటు చేసారు. ఈ అనుభవం పంపేనాటికి నా జీతం రూ. 15,000/–లు. నా అవసరం ఏమిటో నాకు తెలియదు కానీ అవ్యాజ ప్రేమమూర్తి అయిన శ్రీ బాబూజీకి తెలుసు. నా భార్యకు కూడా ఒక చిన్న స్కూల్ నుంచి నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో ఉద్యోగమిప్పించి మమ్మల్ని వారి చల్లని దీవెనతో ఆనందంగా ఉంచుతున్నారు. సద్గురుదేవులు శ్రీ బాబూజీ నాపై కురిపిస్తున్న ప్రేమ ఎంతో ... మాటల్లో వ్యక్తం చేయలేను. ఇలాంటి సద్గురుదేవుని చెంతకు చేర్చిన శ్రీ సాయినాథునికి నమస్సులర్పిస్తూ, జన్మ జన్మలకు శ్రీ బాబూజీ నన్ను వారి చెంతకు చేర్చుకోవాలని ఆకాంక్షిస్తూ, సద్గురు ప్రేమామృతాన్ని మీ అందరితో పంచుకున్నందుకు ఆనందిస్తూ...

**అమర్, హైదరాబాద్**

## అడుగడుగున సద్గురు అభయహస్తం

"అడుగడుగునా సద్గురు అభయహస్తం.... అడుగకనే కాయు జీవిత నేస్తం". ఈ శీర్షిక పేరు ఎక్కడో చదివినట్లుందే! అవునండీ! ఇదంతా సాయి చరిత్రే!! I stay by the side of those who ever chants my name. ఎవరైతే నన్ను స్మరిస్తారో వారి చెంత నేనుంటానన్న సాయి అభయం శ్రీ బాబూజీ తన బిడ్డల జీవితాల్లో సత్యం గావిస్తున్నారు. పై శీర్షిక శ్రీమతి చంద్రాబాయిబోర్కర్ అనుభవానికి 'సాయిపథం' అక్షర రూపం. "అమ్మా, నువ్వు పండరీ వెళ్ళు. నేనూ నీ వెనుకే వస్తాను.నాకు ఏ వాహనాలు అక్కర్లేదు" అంటూ చంద్రాబాయిని, అటు రామచంద్రను సమన్వయ పరుస్తారు సాయి. ఇది చరిత్ర చెప్పే సత్యం. శ్రీ బాబూజీ చెంతన అలాంటి సంఘటనే – అదే సాయి తత్త్వం. – వారి అభయహస్తమే చల్లని నేస్తం.







నా పేరు సంధ్య. మాది సంతనూతలపాడు. నేను మొదటిసారి తిరువన్నామలై మా పాప సాయివసనకు 8 నెలల వయసులో వెళ్ళాను. వెళ్ళిన తరువాత రెండు రోజులు అందరితో కలసి సత్సంగంకు వెళ్ళాను. ముందు వెళ్ళటం వల్ల సాయివసన గొడవ చేస్తుంటే అక్కడ ఆటంకం కలుగుతుందని మరురోజు నేను అందరూ వెళ్ళండి నాకు దారి తెలుసు. మీరు నా వలన ఆగవద్దు తరువాత నేను వస్తాను. అని చెప్పాను. అందరూ వెళ్ళిపోయారు. నేను ఒక గంట తరువాత పాపను తీసుకొని సత్సంగానికి బయలు దేరినాను. వెళుతూ ఉండగా అక్కడ రెండు దారులు ఉన్నాయి. ఒక రూట్‌లో వెళ్ళవలసింది వేరొక రూట్‌లో వెళ్ళినాను. అలా వెళుతూ ఉన్నాను. ఎంత సేపటికి ఆశ్రమం రాలేదు. కొంతదూరం వెళ్ళాక తిరిగి వెనుకకు చూసాను. అంతా ఎడారి చాలా దూరం వచ్చాను. వెనుకకు వెళదామంటే చాలా దూరం వచ్చాను. నాకు ఎదురుగా 2 ఎద్దులు. ఒకతను, ఒక బాబు వస్తున్నారు. ఎద్దులు తల ఆడిస్తూ ముందుకు వస్తున్నాయి. అంతా ఎడారి భయం వేస్తుంది. కొంచెం చీకటి పడింది. వెనుకకు వెళ్ళటం ఇష్టం లేదు. ముందుకు వెళదామంటే నాకు భయం వేస్తూ చిన్నగా ముందుకు వెళుతూ ఉన్నాను. గురుదేవా! నీవద్దకని నీ బిడ్డనైన నన్ను బయలుదేరిన నీ దగ్గరకు తీసుకువెళ్ళు అని, నామం చెప్పుకుంటూ ఏడుస్తూ ముందుకు వెళుతూ ఉన్నాను. అలా అనుకున్న వెంటనే నాకు ఆ రూట్‌లో ఆటోసౌండ్ వినిపించింది. ఇంకొంచెం భయం వేసింది. నా వద్దకు వచ్చి ఆగింది. అందులో నారాఅంకుల్, వాళ్ళ భార్య, భాను ఉన్నారు. భాను ఆటోలో నుండి దిగి ఎక్కడికి ఇటు వెళుతున్నావు, ఆశ్రమానికేనా అని అడిగాడు. అవును ఆశ్రమానికే అని చెప్పాను. ఈ దారిలో వస్తున్నావేమి అని ఆంటీ అడిగింది. దారి తప్పినాను అని చెప్పాను. వాళ్ళు మేము ఎప్పుడు ఈ రూట్‌లో రాలేదు. ఈ రూట్ అసలు తెలియదు. ఈ ఆటో ఆయన ఇటు తీసుకువచ్చాడు అని చెప్పి గురువుగారు నీకోసం పంపించారేమో అని అన్నారు. నాకు వెంటనే చాలా ఆశ్చర్యం వేసింది. నేను చాలా భయపడటం వల్ల ఏడుపు ఆగటం లేదు. అది తలచుకుంటే ఇప్పటికి భయం వేస్తూనే ఉంది. నేను, గురుదేవా నన్ను సత్సంగానికి తీసుకు వెళ్ళు అని అనుకోగానే వెంటనే ఆటో రావడం అనేది నిజంగా చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇది నా జీవితంలో మరచిపోలేని మంచి అనుభవం. ఈ అనుభవం రాస్తూ ఉన్నప్పుడు కూడా నాకు ఎడారిలో ఉన్నది, భయపడినది, ఆటో ఆగడం అనేది కళ్ళకు కనిపిస్తూనే ఉంది.

**– సంధ్య, సంతనూతలపాడు**

**The Sadguru sees Divinity everywhere, That's why his look is Divine.**





# సంఘటనల కూర్పు - సద్గురు అనుగ్రహ నేర్పు

"శుష్క వేదాంతానికి సాయిపథంలో చోటు లేదు" సద్గురుపథమంటే జీవితాన్ని అర్థవంతంగా మలచుకోవడమే! ఆధ్యాత్మిక ప్రగతి కోసమే సద్గురువును ఆశ్రయించాలన్న భక్తులతో సాయి అన్నమాటలు "అలా చెప్పొద్దు! నా మనుషులు నా దగ్గరకు మొదట అలాంటి కారణాలుగానే వస్తారు. వారి కోరికలు తీరి జీవితంలో సౌఖ్యం చిక్కాక, నన్ను అనుసరించి ఆధ్యాత్మికంగా పురోగమిస్తారు". మనలను మనలుగా తీర్చిదిద్ది – స్వావలంబనను చేకూర్చగల దృక్పథమే సద్గురు తత్త్వం. అందుకు వివిధ సంఘటనలు – వివిధ చర్యలు – అయితే ఈ కూర్పంతా సద్గురు నేర్పరితనమే – ప్రగతి బాటన వారి రచనా విధానమే! అందుకే గురూజీ చెప్పే మాటలు –

నా పేరు రఘు. నేను హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా ఉద్యోగం చేస్తున్నాను. ఇది నేను ఇంటర్ చదువుతుండగా బాబా నాకిచ్చిన దీవెన. ప్రథమ సంవత్సరంలో ప్రతి గురువారం నేను బాబా భజనకు వెళ్ళేవాడిని. ఒక్క వారం కూడ మిస్ అయిన జ్ఞాపకం లేదు. ప్రక్కన వేరే ఫోటో వున్నా దానిని నేను చూసేవాడిని కాను. నేను బాబానే దైవంగా తలచేవాణ్ని. అప్పటికి నాకు బాబా గురించి ఏమీ తెలియదు, వినలేదు, చదవలేదు, కానీ బాబా మీద ఇష్టం ఏర్పడింది. పరీక్షలు దగ్గర పడ్డాయి. అందరము వ్రాసాము. ఫలితాలు వచ్చినాక చూస్తే అందులో కేవలం తొమ్మిది మంది మాత్రమే పాస్ అయినాము. అందులో నేనొకడిని. నేనేమి ఫస్ట్ క్లాస్ స్టూడెంట్‌ని కాదు. రెండవ సంవత్సరంలో నాకు నేను పరీక్ష పెట్టుకున్నాను. నేను బాబా గుడికి వెళ్ళటం వలన పాసైయ్యానా? లేక నాకు అంత టాలెంట్ వుందా! అని. రెండవ సంవత్సరంలో ఒక్క వారం కూడా బాబా దగ్గరకు వెళ్ళలేదు. పరీక్షా ఫలితాల ప్రకారం నేను ఒక సబ్జెక్ట్‌లో తప్పాను. అంతేగాక మా అందరి ఫలితాలు విత్‌హెల్డ్‌లో వున్నాయి. తర్వాత బోర్డు వాళ్ళు మా సబ్జెక్ట్‌లో ఒక సబ్జెక్ట్‌ని రద్దు చేశాము అని ప్రకటించారు. కావున నేను మొత్తం రెండు సబ్జెక్ట్‌లు తప్పాను. అదీ కాక ఫలితాలు లేటు అయినందున ఆ సంవత్సరం నాకు డిగ్రీలో చేరే అవకాశం దొరకలేదు. ఇందువలన ఒక సంవత్సరం వృధా అయినది. అప్పటినుంచి బుద్ధిగా వుండాలని నిర్ణయించుకున్నాను బాబా దగ్గర. ఇది నాకు డిగ్రీ ఆఖరి సంవత్సరం వ్రాస్తున్నపుడు జరిగిన అనుభవం. కాదు, బాబా నాపై చూపిన ప్రేమ. ఫైనలియర్ పరీక్షలకు ముందు ప్రిపరేషన్ టైంలో నేను ప్రతిరోజూ రాత్రి మొత్తం నిద్రలేకుండా చదివేవాడిని. పరీక్షలు దగ్గర పడుతూండగా హఠాత్తుగా నాకు మొదలైంది. చిన్నగా ముఖంలో ఒక్కొక్క అవయవం పనిచేయకుండా ఉండటం ప్రారంభించింది. మొదట మూతి ఎడమవైపు స్పందన లేదు. నవ్వినపుడు ఒక ప్రక్కకు వెళ్ళేది. ఎడమ ముక్కు, చెవి, చెంప, కన్ను, కనురెప్పలు ఏవీ పని





చేయలేదు. ఎడమవైపు కన్ను మూతపడేది కాదు. రాత్రిపూట చేతితో కన్నుమూసి చేతిరుమాలుతో రెండు కళ్ళను కట్టుకునేవాడిని. ఇది చాలదా అన్నట్లు ఆ టైంలో నాకు అప్పుడప్పుడు రెండు కాళ్ళు, రెండు చేతులు విపరీతమైన నొప్పులు వచ్చేవి. ఒక్క అడుగు కూడా వేసేవాడిని కాదు. పూర్తిగా చచ్చుపడి పోయేవి. ఫిజిక్స్ పరీక్షకు ఏమీ చదువలేకపోయాను. ప్రతీరోజూ నా రూమ్‌లో పెట్టుకున్న బాబా ఫోటోకి పూజచేసి హాల్ టిక్కెట్టును ఫోటోదగ్గర పెట్టేవాడిని. పరీక్ష ఇంకో గంట టైం వుందనగా హఠాత్తుగా నొప్పులు మొదలయినాయి. నేను వున్న హాస్టల్ నుండి నా పరీక్ష హాల్‌కి వెళ్ళాలంటే అరగంట పడుతుంది. బాబాను వేడుకున్నాను. నొప్పులు ఎక్కువగా వున్నాయి తగ్గించి పరీక్ష వ్రాయించు అని. కొంచెం సేపటికి నొప్పులు తగ్గాయి. పరీక్ష వ్రాసాను. కానీ చదవని కారణంగా, అందులోను అందరికీ కష్టం అన్పించిన ఆ పేపరులో నేను కేవలం 30-35 మార్కులకు మాత్రమే వ్రాయగలిగాను. అది కూడా ఊరినే కూర్చోలేక ఏదో వ్రాసాను. అన్నీ పరీక్షలు అయినాక మా ఊరు వెళ్ళి ప్రతిరోజు బాబా గుడికి వెళ్లేవాడిని. రిజల్ట్స్ వచ్చాయి. కానీ ఫలితాలు చూడలేదు. ఎందుకంటే ఆశలేదు. ఫెయిల్ అవుతాను అని గట్టి నమ్మకం. మరుసటి రోజు కూడా పేపరులో ఫలితాలు ఇచ్చారు, అయినా చూడలేదు. చివరగా మూడవరోజు నా ఫ్రెండ్ వచ్చి పేపరు తెచ్చి వాడి నెంబర్‌ని వెతికిపెట్టమన్నాడు. అపుడు కానీ చూడలేదు నేను పేపర్‌ని. పేపరు తెరవగానే బాబా, గురువుగార్ల ప్రేమ ఒక్కసారిగా కనిపించేసరికి నా కళ్ళ వెంట నీళ్ళు కారాయి. నా చూపు డైరెక్ట్‌గా నా నెంబర్‌మీదే పడింది. ఇది నమ్మలేని విషయం. నిజంగా నేను వ్రాసినది 30-35 మార్కులకే, నేను ఎలా పాసయ్యాను? ఇదేమి గణితం పేపరు కాదే. ప్రతి ప్రశ్నకు ఫుల్ మార్క్స్ రావటానికి. ఆ రోజు నేను చాలా ఆనందపడ్డాను. బాబా, గురువుగార్లు నాపై చూపిన దయ, ప్రేమకు నాకు చాలా ఆనందం వేసింది. హాస్టల్‌లో పరీక్షల సమయం కాబట్టి నన్ను అంతగా ఎవ్వరూ పట్టించుకోలేదు. బాబా, గురువుగార్లు తప్ప. దానికి నిదర్శనమే పైన చెప్పిన అనుభవం.

శ్రీ బాబూజీ నా ప్రగతి కోసం చేసే ఏర్పాట్లు నన్ను ఆశ్చర్యపరుస్తున్నాయి. నా కంపెనీలో నేను ప్రమోషన్ కోసం జనవరి 11వ తేదీన ఇంటర్వ్యూకు వెళ్లాను . నాకు తెలుసు అది పేరుకు మాత్రమేనని, అప్పటికే వాళ్లు ఇంకొక అతనిని సెలెక్ట్ చేసారని. కాని వెల్లవలసి వచ్చింది. వాళ్లు ప్రశ్నలడిగినా నేను సమాధానం చెప్పలేదు. మరలా 19వ తేదీన నన్ను ఇంటర్వ్యూకు పిలిచారు. దాంతో నేను చాలా చిరాకుగా ఫీల్ అయ్యి అడిగిన రెండు ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పలేదు. కానీ నన్నే సెలెక్ట్ చేశారు. అర్థం కాలేదు, గురుదేవుల ప్రణాళిక. అంతకు ముందే బొడ్డపాడు వార్షికోత్సవంలో గురుదేవులకు చెప్పుకున్నాను. నన్ను ఉన్నతస్థానంలో ఉంచమని. అప్పటికే సెలెక్ట్ చేసిన వ్యక్తితో ఉన్న ఇబ్బందులు కంపెనీ వారికి అవగతమై ఆ పోస్టును నాకప్పగించారు. **- రఘు, హైదరాబాద్**







# రసస్పందన

సద్గురు చరణార్చనకు భక్తజనులు కూర్చిన పుష్పములు మనసులకు కడు నిండైన తృప్తిని చేకూర్చితే, వారి అనుభవములు, ఆచరణాత్మక జీవన విధానమునే అక్షరార్చన మన జీవితమనే ఒక చక్కటి పూలతోటకు బాటలు వేయగలదు. ఈ గొప్ప తత్త్వాన్ని సద్గురు సామ్రాట్ శ్రీ సాయిబాబా ఒక చిన్న మాటను చెప్పి మనకు సాయి బాటను చూపారు. – 'పని చెయ్యి – సద్గ్రంథాలు చదువు' అని. మహాత్ముల చరిత్రలు మనకు సమగ్రమైన, సహేతుకమైన, సత్యమైన జీవన విధానాన్ని నేర్పుతాయి. అందుకే శ్రీ బాబూజీ అంటారు. 'ఈనాడు మహాత్ముల జీవితాలే మనకు మార్గదర్శకాలని!. పూజ్య గురుదేవుల అపారమైన ప్రేమ, అనుగ్రహాశీస్సుల ఫలితం నేడు ఏ మహాత్ముని చరిత్ర చదివినా, అందు స(మ)ద్గురు దర్శనమే ద్యోతకమవ్వడం. అదే శ్రీ వివేకానంద స్వామి జీవిత చరిత్ర అధ్యయనంలోనూ జరుగుతోంది.

గురుదేవుల సత్యనిష్ఠ, సాయిపట్ల వారి నిబద్ధత, ఆచరణాత్మక జీవన విధానం, వారి బిడ్డలను తీర్చిదిద్దే విధానం, తను శ్రేయోదాయకమని నమ్మిన మార్గాన్ని ఈ జగమంతటికీ తెలియచెప్పడం – అగాధమైన సాయిలీలలో జ్ఞాన రత్నాలను వెలికితీసే నైపుణ్యత – శ్రీ వివేకానంద స్వామి జీవితంలోని ప్రతీ సంఘటనలోనూ దర్శనమిస్తుంది. చర్విత చర్వణమైన సద్గురు లీలా ప్రబోధాన్ని ఆసాంతం అవలోకించుకునే ప్రయత్నంలో రసస్పందన.

వివేకానందస్వామి, రామకృష్ణుల ప్రథమ కలయికలో వారి భావాలను గమనించి ఉన్నాం. అయితే సంఘటన పూర్వా పరాలలోకి వెళితే నరేంద్రుని చూసిన మొదటిసారే, శ్రీ రామకృష్ణులు నరేంద్రుడు పాట పాడటం ముగించగానే వారున్న ఇంట్లోని ఒక ప్రక్కకు నరేంద్రుడ్ని తోడ్కొని వెళ్ళి అప్యాయత ఉట్టిపడే కంఠ స్వరంతో ఇలా అంటారు. "ఇంత ఆలస్యంగా నువ్వు రావడం న్యాయమేనా? నీ కోసం నేనెంత పరితపిస్తూ ఎదురు చూస్తున్నానో ఒక్కసారన్నా ఆలోచించావా? ఈ లౌకికుల ఉబుసుపోక కబుర్లతో నా చెవులు తూట్లు పడిపోయాయి". అంటూ అసంబద్ధంగా మాట్లాడుతూ విలపించారు. అంతేకాదు భక్తుడు భగవంతునికి నమస్సులర్పిస్తున్నట్లు చేతులు జోడించి "నాకు తెలుసు ప్రభూ, సనాతన నర నారాయణ ఋషులలో నువ్వు నరుడువు అని నేనెరుగుదును, నువ్వు మానవాళి కష్టాలను, దుఃఖాలను బాప, ఈ రూపంలో ఇప్పుడు అవతరించావు". అంటూ నమస్కరిస్తారు నరేంద్రునికి.







ఈ సంఘటనను చూసి విస్తుబోయిన నరేంద్రుడు రామకృష్ణులను పిచ్చివానిగా పరిగణిస్తారు. అయితే శ్రీ రామకృష్ణులు ఇతరులతో ప్రవర్తించేటప్పుడు వారి వైఖరిలో ఎట్టి పిచ్చితనమూ కన్పించదు. అంతేకాదు; "మహాశయా! మీరుభగవంతుణ్ణి కళ్లారా చూశారా? "అన్న నరేంద్రుని ప్రశ్నకు అవును చూశాను, ఎంతో స్పష్టంగా, నిన్ను చూస్తున్నంత స్పష్టంగా, ఇంకా స్పష్టంగా" అంటూ సముద్రంలో జీవిస్తూ తొలకరికై వీచి చూచే ముత్తెపు చిప్పలో వానచినుకులా రామకృష్ణుల మాటలు నరేంద్రుడ్ని ప్రభావితం చేసాయి. "ధనం కోసం, సుఖ భోగాల కోసం, భార్యాపిల్లల కోసం పరితపించే జనం భగవద్దర్శనం కోసం పరితపిస్తే భగవంతుడు తప్పక సాక్షాత్కరిస్తాడంటారు" రామకృష్ణులు. సద్గురు జ్ఞాన వాణి ఇనుమడించిన ఉత్సాహాన్ని రేకెత్తించింది నరేంద్రునిలో. రామకృష్ణుల పావనత్వాన్ని, పరిత్యాగాన్ని, వైరాగ్యాన్ని దర్శించిన నరేంద్రుడు వారి పాదాలకు ప్రణమిల్లి సెలవు పుచ్చుకుంటాడు.

దైనందిన కర్తవ్యాల పట్ల రామకృష్ణుల వద్దకు రెండవసారి అంత త్వరగా వెళ్ళినప్పటికీ, వారిని దర్శించమని అతని సత్యనిష్ఠ, స్మృతి పదే పదే అతనిని పురికొల్పుతూనే ఉన్నాయి. దక్షిణేశ్వరంలో రెండవసారి రామకృష్ణుల దర్శనం కోసం వెళ్ళినపుడు జరిగిన సంఘటన నరేంద్రుని మటల్లో "నన్ను చూడగానే నన్ను దగ్గరకు రమ్మని పిలిచి ఆనందంగా చిన్న మంచం చివర కూర్చో బెట్టుకున్నారు. నన్ను చూస్తూ అస్పష్టంగా తమలో తామే ఏదో గొణుక్కుంటున్నారు. మరో పిచ్చి దృశ్యాన్ని చూడబోతున్నా ననుకున్నాను. ఇంతలోనే ఆయన నా వద్దకు వచ్చి వారి కుడిపాదాన్ని నాపై ఉంచారు. తక్షణమే నాకొక అద్భుత అనుభూతి కలిగింది.

గదిలోని వస్తువులన్నీ గోడలతో సహా గిరగిరా తిరుగుతూ ఏదో తెలియరాని ప్రాంతానికి తిరోగమించడమూ, ఈ విశ్వమంతా 'నేను' అన్న భావంతో సహా సమస్తాన్నీ మ్రింగి వేసే మహా శూన్యంలోకి మాయమై పోవడమూ కళ్లారా చూశాను. అప్పుడు నన్ను భయం ఆవరించింది. నన్ను నేను అదుపులో ఉంచుకోలేక 'ఆహా! నాకు మీరు ఏంచేశారు? నాకు తల్లి దండ్రులున్నారని మీకు తెలుసా! అంటూ బిగ్గరగా కేక పెట్టాను. 'సరే ఇది ఉపశమిస్తుంది లే! అని వారంటుండగానే నేను మామూలు స్థితిలోకి వచ్చి గదిలోనూ, బయట వస్తువులన్నీ నిశ్చలమయ్యాయి. ఆ సంఘటనను వర్ణించడానికి ఒకింత సమయం పట్టినప్పటికినీ, నిజంగా అది జరగడానికి అంతకంటే తక్కువ సమయం పట్టింది". ఈ సంఘటన నరేంద్రునిలో గొప్ప విప్లవాన్నే ఉత్పన్నం చేసింది. దుర్బల మనస్కులైన జనులపై గొప్ప సంకల్ప శక్తి గలవారి యొక్క ప్రభావం ఇలా ఉండే అవకాశమున్నా, నరేంద్రునికి తనపై తనకు అపారమైన నమ్మకం, స్థిర చిత్తం ఉన్నాయి. ఈ సంఘటనతో రామకృష్ణులపై తన అభిప్రాయం సరిరాలేదని అవగతమవుతుంది. అనుల్లంఘనీయమైన ఆ దివ్యశక్తి ముందు తన తెలివితేటలు, మనోశక్తి





నిరుపయోగాలని గ్రహిస్తాడు. తనను నరనారాయణుడంటు స్తుతిస్తున్న రామకృష్ణుల వచనాలను యుక్తి యుక్తము, జ్ఞానదాయకమైన నరేంద్రుని మనస్సు అంగీకరించదు. అయితే రామకృష్ణులను అవతార పురుషునిగావించి భగవత్సాక్షాత్కారం ఎలా పొంది తరించాలో తెలుసుకొన కుతుహలపడతాడు నరేంద్రుడు. తన నిశ్చితాభిప్రాయాలను మార్చుకుని నూతన సత్యాలను అంగీకరించవలసి రావడంతో కొంత సంఘర్షణకు లోనైనా దాని పర్యవసానమే రామకృష్ణుల వాణి ఈ ప్రపంచమంతా ఎలుగెత్తి చాటడంలో ఎంతో దోహదపడింది.

సద్గురువుకు బిడ్డల పట్ల ఉండే తపనకు నిదర్శనం – రామకృష్ణుల ఈ భావం. నరేంద్రుడు సంపూర్ణంగా పద్దెనిమిది గుణాలు కలిగి ఉండేవాడు. కేవలం రెండు లేదా ఒకటి గుణాలు సంపూర్ణంగా ఉన్న వ్యక్తులు లోకంలో అసాధారణ ప్రాబల్యాన్ని, ప్రఖ్యాతిని సంపాదించే అవకావం ఉంది. అయితే నరేంద్రునిలోని ఆ గుణాలన్నీ ఆధ్యాత్మిక పథంలో నిర్దేశించుకొనకపోతే, అవాంఛనీయ ఫలితాలను చవిచూడవలసివచ్చి, లోకం ఒక గొప్ప వరాన్ని కోల్పోతుందని రామకృష్ణులు వివేకానందుని సచ్ఛిష్యునిగా కంటే కన్నబిడ్డగా చూసారంటే అతిశయోక్తి కాదు. శ్రీ రామకృష్ణ – నరేంద్రుల అనుబంధాన్ని అధ్యయనం చేస్తే ఒక ప్రక్క సహేతుకం కానీ ఏ అంశాన్ని అంగీకరించని నరేంద్రుని ధృడనిశ్చయం, శిష్యునికి ఉన్నత ఆధ్యాత్మిక సత్యాలను అనుభూతం చేయాలన్న శ్రీ రామకృష్ణుల తపన మనలను ముగ్ధులను చేస్తాయి. మనం నడిచే మాటనే మనలను నడిపి చివరకు గమ్యం చేర్చకనే సద్గురు మాయి తత్త్వం అవగతమవుతుంది. శుష్కమైన వేదాంతాన్ని అంగీకరించని సాయిపథమనే రాచమార్గాన్ని మనం వివేకానందుని జీవితంలో గమనించవచ్చు. సామాన్య జనం నరేంద్రుని స్వేచ్ఛాయుత జీవనాన్ని (తనకు నచ్చిన రీతిన, తాను సత్యమని నమ్మిన రీతిన) అహంకారమనుకోవడం కద్దు. ఇతరుల భావాల పట్ల అతని ఉదాసీనవైఖరి ఆతని ఆత్మస్థైర్యం నుంచి వచ్చిందని రామకృష్ణులు గమనించకపోలేదు. అట్టి అనుపమానమైన ఆత్మస్థైర్యాన్నే నరేంద్రుని ఈ మాటలే – "ఈ భారతావనిలో కేవలం ఒక కుక్కైనా ఆకలితో అలమటిస్తున్నా నేను సకల జీవుల ఆకలి తీరే వరకు జన్మిస్తుంటా!". ఇతరుల పొగడ్తలకు పొంగిపోయే దుర్బల మనస్సు కాదు కనుకనే రామకృష్ణులు నరేంద్రుని బాహాటంగానే పొగిడేవారు. మహాత్ముల జీవితాలలో జరిగే ఎన్నో సంఘటనలు మనకు వారిలోని సామ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపుతూ ఎన్నో ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఈ క్రింది సంఘటనల క్రమాన్ని గమనిద్దాం.

రామకృష్ణులు స్వతహాగా నిషిద్ధాహారం తిన్న భక్తులను ఆ సమయంలో తాకనైనా తాకేవారు కాదు. కానీ ఒక రోజు నరేంద్రుడు భోజనశాలలో భోజనం చేసి తిన్నగా రామకృష్ణుల వద్దకు వచ్చి 'మహాశయా, జనం నిషిద్ధ ఆహారంగా ఎంచే భోజనశాలలో భోజనం చేశాను' అని చెప్పాడు. తక్షణమే



రామకృష్ణులు 'అలా చేసినందున నీకెలాంటి దోషము అంటదు. మాంసం తినికూడా ఒకరు భగవంతునిపై శ్రద్ధ వహిస్తే ఆ వ్యక్తి శుద్ధమైన ఆహారం తిన్నట్లే లెక్క. ఆకులు, అలములు తింటూ కూడా లౌకిక కోర్కెలలోనే మునిగే వ్యక్తి నిషిద్ధాహారం తిన్నట్లే లెక్క. కానీ, నీ విషయం అట్లాకాదు' అని అంటారు. "గురువు సకల ధర్మాత్ముడని' నమ్మిన సద్భక్తునికి యుక్తాయుక్తముల చింతలేదనుటకు సందేహమేముంది.

ఒక రోజు పంచవటి (వారున్న గృహం)లో రామకృష్ణులు, నరేంద్రుని ఒక వైపుకు తీసుకువెళ్ళి ఇలా చెప్పారు. "సుదీర్ఘ కాల తపస్సు ఫలితంగా నాకు అణిమాది అష్ట సిద్ధులు లభించాయి. కానీ, కట్టుబట్ట వంటిమీద ఉందో లేదో అన్న ఎరుక లేని నాకు వాటిని ఉపయోగించే సందర్భమూ, అవకాశమూ ఎక్కడుంది. జగ్గజ్జనని యొక్క పనిని నీవు ఎంతో చేయవలసి ఉంది కనుక అవి అమ్మ నడిగి నీకిప్పించాలని అనుకుంటున్నానని పలుకుతారు. నరేంద్రుడు తీవ్రంగా ఆలోచించి "మహాశయా! ఈ శక్తులు భగవత్సాక్షాత్కారానికి నాకు దోహదం చేస్తాయా?" అని అడుగుతాడు. అవి భగవత్సాక్షాత్కారనంతరం బాసటగా నిలుస్తాయంటారు రామకృష్ణులు.

"అలా అయితే మహాశయా, వాటి అవసరం నాకు లేదు. ముందు భగవత్సాక్షాత్కారం పొందనివ్వండి. ఆ అద్భుత శక్తులను ఇప్పుడే పొందితే, నా లక్ష్యాన్ని విస్మరించి, స్వార్థపరుడనై వాటిని అనుచితంగా ఉపయోగిస్తే ప్రయోజనం ఉండదు" అంటూ నిష్కర్షగా తిరస్కరిస్తాడు. ఈ మాటలు విని రామకృష్ణులు ఎంతో ప్రసన్నులయ్యారు. సద్గురువు దయగల తండ్రి. తన బిడ్డలలో ఆయన ఎప్పుడూ "బిందువులో ఉన్న సింధువే" గమనిస్తాడు గానీ అన్యము గాదు. మన హృదయాలలో వారు నాటిన ఆధ్యాత్మ బీజాల వెనుక ఉన్న పుష్పఫలభరిత వృక్షములను గాంచి అనుగ్రహించడమే తన అవతార కార్యంగా సాగిస్తాడు.

శ్రీ రామకృష్ణ నరేంద్రుల మధ్య నెలకొన్న ఈ నిస్వార్థ ప్రేమ ఉదంతంలోని ప్రతీ ఘట్టాన్ని వర్ణించాలన్న తహ తహ ఉన్నా ఇది మాటలలో వర్ణించగలిగే బంధం కాదు. ఈ బంధం వెనుక ఊహకందని బోధ ఉంది. సద్గురు లీలా ప్రబోధాన్ని మీ అందరితో పంచుకోవాలన్న సత్సంకల్పం. అయితే విస్తారమైన సద్గురు భక్తుల చరిత్రను విశేషంగా అందించడం ఎవరి తరమూ కాదు. ఇది గురు సంప్రదాయంలో ఒక్క అడుగు వేయాలన్న తపనకు నాంది – పది అడుగులు వేయటానికి సిద్ధంగా ఉన్న సద్గురు చంద్రులు శ్రీ బాబూజీ పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేసుకోవడానికి పునాది.

**సద్గురువే విశ్వప్రభువు. ఆయన సంకల్పమే సృష్టి, అనుగ్రహమే స్థితి, దర్శనమే లయం.**





# సాయి వంటి దైవంబు లేడోయి... లేడోయి...



ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాధుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

**- శ్రీ బాబూజీ**

## అనుభవాలు - అమరికలు



| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి... | - | శ్రీ బాబూజీ | ------- | 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్న మాట | - | గురుబంధువులు | ------- | 3 |
| 3. | మిషలు - ప్రగతి పథాలు | - | సురేష్ | ------- | 6 |
| 4. | స్వప్నమా - కాదు సత్యమే! | - | కె. రమాదేవి | ------- | 8 |
| 5. | ప్రణాళికా బద్ధం - అనుగ్రహంతో అన్నీ సిద్ధం | - | అమర్ | ------- | 10 |
| 6. | అడుగడుగున సద్గురు అభయహస్తం | - | సంధ్య | ------- | 12 |
| 7. | సంఘటనల కూర్పు - సద్గురు అనుగ్రహ నేర్పు | - | రఘు | ------- | 14 |
| 8. | రసస్పందన | - | గురుకృప | ------- | 16 |




**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాధ్ మహారాజ్‌కీ జై !**
**సద్గురు శ్రీ సాయినాధుని శరద్బాబూజీకీ జై !**

# గురుకృప

మహోన్నత లక్ష్యం-మహిత మార్గం



# శ్రీరామ నవమి సంచిక

గురోవినతిమీ కరీ హృదయ మందిరీ యా బసా ! సమస్త జగ్‌హే గురు స్వరూప చీ ఠసో మానసా !
కరో సతతత సత్కృతీ మతిహిదే జగత్పావనా

